

ఆధ్యాత్మిక క్షేత్రం నవనాథ సిద్దుల గుట్ట 2





భీమ్‌గల్‌లో ఫలించిన సునీల్ రెడ్డి వ్యూహం.. 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in



శైవక్షేత్రాలకు శివరాత్రి శోభ.. – మిగతా 2వ పేజీలో..






## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సీపీ

**అక్షరటుడే, బోధన్ :** యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని.. వాటి కారణంగా జీవితాలను నాశనం చేసుకోవద్దని సీపీ సాయిచైతన్య సూచించారు. నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో యువతకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీపీ హాజరై మాట్లాడారు. డ్రగ్స్ కారణంగా వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు కూడా చిన్నాభిన్నం అయిన సందర్భాలు ఉన్నాయన్నారు. మత్తుపదార్థాలపై విద్యార్థులకు ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సరదాగానో, స్నేహితులు ప్రలోభపెట్టారని యువత మత్తుపదార్థాలు జోలికి వెళ్లవద్దని.. కెరీర్‌ను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గమనించాలన్నారు. నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ కవిత రెడ్డి, ట్రెజరర్ సంతోష్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలు దుష్యంత్, శిరీష్, హితిన్, ఉషారాణి, కొడాలి కిషోర్, సాంబిరెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్‌హెచ్‌వో వెంకటనారాయణ, రూరల్ సీఐ విజయ్ బాబు, రుద్రూరు సీఐ కృష్ణ, ఎస్సైలు భానుప్రకాష్, సందీప్ నార్కోటిక్ సభ్యులు మనోజ్, మహేష్, భాస్కర్, మచ్చేందర్ రెడ్డి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రమాదాల నివారణకు రోడ్డుపై డ్రమ్ముల ఏర్పాటు

**అక్షరటుడే, కామారెడ్డి :** రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ చర్యలు తీసుకుంటోంది. ప్రధాన మార్గాల్లో బ్లాక్ స్పాట్లు గుర్తించి ఎక్కడికక్కడ బారికేడ్లు, డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్నారు. ఫలితంగా గతంలో కంటే ప్రమాదాలు తగ్గాయి. పాల్వంచ మండల కేంద్రంతో పాటు భవానీపేట గ్రామాల మధ్యలో ఉన్న ఎన్‌హెచ్ 11 రహదారిపై రేడియంతో కూడిన 9 డ్రమ్ములను శనివారం ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారణతో పాటు వాహనాల వేగాన్ని తగ్గించేందుకు రూరల్ సీఐ రామన్ ఆధ్వర్యంలో మాచారెడ్డి పోలీసులు వీటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సీఐ రామన్, మాచారెడ్డి ఎస్సై అనిల్, పోలీస్ సిబ్బంది, పాల్వంచ, భవానీపేట సర్పంచ్, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠం 'హస్త'గతం కావడం దాదాపు ఖాయమైంది. మజ్లిస్ పార్టీ అభ్యర్థుల మద్దతుతో మున్సిపల్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేయనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు తాము ప్రతిపక్షంలో కూర్చుంటామని ఎంపీ అర్వింద్ సైతం ప్రకటించారు. దీంతో హస్తం పార్టీ మేయర్ పీఠాన్ని అధికారికంగా దక్కించుకోవడమే తరువాయిగా మారింది.** - అక్షరటుడే, ఇందూరు



## మేయర్ పీఠం

# 'హస్త'గతమే..!

- అభ్యర్థిత్వంపై ఉత్కంఠ
- రేసులో పలువురి పేర్లు

ఎన్నికల కోలాహలం ముగిసింది. శుక్రవారం హోరాహోరీగా ఓట్ల లెక్కింపు జరిగిన విషయం తెలిసిందే. నిజామాబాద్ నగరంలోని 60 డివిజన్లు ఉండగా.. బీజేపీ అత్యధికంగా 28 సీట్లను సొంతం చేసుకుంది. అలాగే కాంగ్రెస్ 17, ఎంఐఎం 14, బీఆర్ఎస్ 1 సీటును దక్కించుకుంది. దీంతో హంగ్ ఏర్పడింది. కాగా.. మేయర్ పీఠం కోసం ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్ క్యాంపు రాజకీయాలకు తెరతీశాయి. తమ అభ్యర్థులను క్యాంపులకు తరలించాయి. అయితే కాంగ్రెస్ పార్టీకి ఎంఐఎం మద్దతు ఇవ్వనుండడంతో పాటు బీఆర్ఎస్ అభ్యర్థి సైతం ఆ పార్టీ వైపే ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో కాంగ్రెస్‌కు మెజారిటీకి కావాల్సిన సంఖ్య బలం వచ్చినట్లయ్యింది. అయినప్పటికీ అభ్యర్థులంతా మేయర్ ఎన్నిక వరకు క్యాంపులలో ఉండనున్నారు. అభ్యర్థులు తమ చేజారకుండా జాగ్రత్తలు పడుతున్నారు.

### ఎక్స్ అఫీషియో ఓట్లు కీలకం..

సాధారణంగా ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని పక్షంలో ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ కార్పొరేషన్‌లో హంగ్ ఏర్పడిన తరుణంలో ఎక్స్ అఫిషియోల ఓట్లు కీలకంగా మారాయి. కాగా.. ఈ సభ్యుల ఓట్ల విషయంలో ఎన్నికల సంఘం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక మున్సిపాలిటీల్లో రిజిస్టర్ అయి ఉన్నవారు మాత్రమే ఎక్స్ అఫిషియో ఓటు వినియోగించుకునే అవకాశం ఉన్నాయి. ఈ క్రమంలో బీజేపీకి ఇద్దరు, కాంగ్రెస్‌కు ఇద్దరు చొప్పున సభ్యులు ఉన్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఎంఐఎం, బీఆర్ఎస్ సభ్యుల బలం కలిపితే 32కు చేరుతుంది. ఇద్దరు ఎక్స్ అఫిషియోది కలిపితే 34 మంది బలం కానుంది. ఇక బీజేపీ విషయానికి వస్తే 28 మంది గెలుపొందగా.. ఇద్దరు ఎక్స్ అఫిషియోలతో కలిపి 30కి బలం చేరనుంది.

### అభ్యర్థి ఎంపికపై కసరత్తు

నిజామాబాద్ మేయర్ ఎంపిక విషయంలో కాంగ్రెస్ ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రధానంగా పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ సొంత ఇలాఖా కావడంతో ఆయన నిర్ణయయమే అంతిమం కానుంది. కాంగ్రెస్ నుంచి గెలిచిన వారిలో నలుగురు మహిళలు ఉండగా.. ముందు వరుసలో పంచరెడ్డి లలిత చరణ్ ప్రధానంగా వినిపిస్తోంది. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు జిల్లా నేతలు సైతం వీరికి మద్దతు ఇస్తుండడంతో లలిత మేయర్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఉమారాణి, సురేఖ, పూజితల పేర్లు సైతం పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## కామారెడ్డి డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 17న ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో మేళా జరుగనుందని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో బహుళజాతి కంపెనీలైన క్యాలిబర్, జస్ట్ డయల్, డీబీఎస్ బ్యాంక్, 24/7 జాబ్స్, జియో, సాగిలిటీ, డిజిటైడ్, ముత్తూట్, మెడ్‌ప్లస్ లో ఉద్యోగాల కోసం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీలో 50శాతం మార్కులు కలిగి ఉండి 30ఏళ్లలోపు వయసు ఉన్నవారు అర్హులని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 17న ఉదయం 10:30 లోపు రెజ్యూమ్, అకడమిక్ సర్టిఫికెట్స్‌తో కళాశాలలో హాజరు కావాలనానారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాల టీఎస్‌కేసీ విభాగంలో లేదా కంపెనీ సంబంధీకులను 9553141962, 8184827291 నంబర్లలలో సంప్రదించాలని సూచించారు.




## ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ బాస్కెట్‌బాల్ టోర్నీకి పీడీ రమేష్

**అక్షరటుడే, ఇందూరు:** ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ బాస్కెట్ బాల్ టోర్నీకి జిల్లాలోని నవీపేట మండలం జన్నెపల్లి ప్రభుత్వ పాఠశాల పీడీ రమేష్ ఎంపికయ్యారు.. ఈ మేరకు ఆయన రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నారు. టోర్నీ ఈనెల 17వ తేదీ నుంచి 23 వరకు న్యూఢిల్లీలో జరగనుంది. ఈ సందర్భంగా రమేష్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జన్నెపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ తదితరులు అభినందించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.




# బీఆర్ఎస్ చుట్టూ రాజకీయం

- ఆ పార్టీ ఎవరికి మద్దతిస్తే వారికే ఛైర్‌పర్సన్ పీఠం
- క్యాంపునకు తరలిన అన్ని పార్టీల కౌన్సిలర్లు
- కామారెడ్డిలో ఉత్కంఠగా రాజకీయాలు

**కామారెడ్డిలో మున్సిపాలిటీలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వకపోవడంతో ఛైర్‌పర్సన్ పీఠంపై ఉత్కంఠ నెలకొంది. మ్యాజిక్ ఫిగర్ చేరుకోవాలంటే బీఆర్ఎస్ మద్దతు అవసరం కావడంతో.. కాంగ్రెస్, బీజేపీ ఏం చేస్తాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. దీంతో బీఆర్ఎస్ చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. అయితే గులాబీ పార్టీ ఎవరికి మద్దతు ఇస్తుందో వేచి చూడాలి.**

– అక్షరటుడే, కామారెడ్డి

కామారెడ్డి మున్సిపాలిటీలో 49 వార్డులున్నాయి. అన్ని పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేశారు. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో ఏ పార్టీకి ఛైర్మన్ పీఠం దక్కించుకునేందుకు కావాల్సిన కౌన్సిలర్ స్థానాలు దక్కలేదు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి దక్కాలంటే 25 మంది కౌన్సిలర్లు ఉండాలి. కాంగ్రెస్ 19, బీజేపీ 16, బీఆర్ఎస్ 11 స్థానాల్లో గెలుపొందాయి. ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు గెలవగా.. వారు శుక్రవారం రాత్రి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో కాంగ్రెస్ బలం 22కు చేరింది. మరో ముగ్గురు మద్దతు లభిస్తే ఆ పార్టీ ఛైర్మన్ పీఠం దక్కించుకోనుంది.

### బీఆర్ఎస్ ఎటువైపో..

ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు 11 స్థానాలు లభించడంతో ఇప్పుడు ఆ పార్టీ కీలకంగా మారింది. బీఆర్ఎస్ సహకారం అందిస్తేనే ఛైర్మన్ పీఠం దక్కే అవకాశం ఉంది. దాంతో ఆ పార్టీ నేతలను తమవైపు తిప్పుకునేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు ప్రారంభించిందన్న టాక్ పొలిటికల్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ముగ్గురు కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకుంటే మున్సిపల్ పీఠం దక్కించుకునే అవకాశం ఉంది. మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్ కలిస్తే వాటి బలం 27కు చేరనుంది. దీంతో సులువుగా పదవిని దక్కించుకోవచ్చు. అయితే ఆ రెండు పార్టీలు కలుస్తాయా లేదా అనేది తేలాల్సి ఉంది.

### క్యాంపునకు చేరిన కౌన్సిలర్లు

ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణమే ఆయా పార్టీల కౌన్సిలర్లను ముఖ్య నేతలు క్యాంపునకు తరలించారు. ఈ క్రమంలో క్యాంపు చుట్టూ రాజకీయాలు చోటు చేసుకున్నాయి. క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు ఈ నెల 16న నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకోనున్నారు. అప్పటివరకు సస్పెన్స్ కొనసాగనుంది. ఛైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా అన్ని పార్టీలు విప్ జారీ చేసే అవకాశం ఉంది. దీంతో ఇతర పార్టీకి ఓటు వేస్తే సదరు సభ్యుడిపై వేటు పడే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలో కామారెడ్డి పీఠం ఎవరిని వరిస్తుందోనని ప్రజలు ఉత్కంఠతో చూస్తున్నారు.




## ప్రతిపక్షంలో కూర్చుంటాం : అర్వింద్

**అక్షరటుడే, ఇందూరు :** పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ కల్మా చదివి ఎంఐఎంతో పొత్తు పెట్టుకోవాలని ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందూరు మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రతిపక్ష స్థానంలో ఉండి అర్బన్ అభివృద్ధి కోసం పోరాడుతామని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ.. బీజేపీ శ్రేణులు తమ డివిజన్లలో అభ్యర్థులను గెలిపించుకునేందుకు శాయాశక్తులా కృషి చేశాయన్నారు. అలాగే అర్బన్‌లో 28 సీట్లు సాధించడం అనేది భారీ విజయంగా భావిస్తున్నామన్నారు. ఏ పార్టీతోనూ పొత్తుకు అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. కౌంటింగ్ ముగియగానే కాంగ్రెస్ నీచ రాజకీయాలు ప్రారంభించిందని.. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన కార్పొరేటర్‌ను రాత్రికి రాత్రే ఎత్తుకెళ్లడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. పోలీసుశాఖ సైతం సదరు కార్పొరేటర్ ఇంటి వద్ద ఒక ఏసీపీ, నలుగురు ఎస్సైలను బందోబస్తుగా ఉంచడం అధికార పార్టీకి మద్దతు తెలిపినట్లేనన్నారు. ఇందూరులో నీచ రాజకీయాలకు ఇది తార్కాణంగా నిలుస్తోందన్నారు. నిజామాబాద్ కార్పొరేటర్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు పార్టీకి పూర్తి సంతృప్తిని ఇచ్చాయని ఆయన అన్నారు. అర్బన్‌లో బీఆర్ఎస్‌ను పూర్తిగా ఊడ్చేశామన్నారు. రాయికల్, మెట్‌పల్లిలో బీజేపీ స్థానాలను నిలబెట్టుకుందన్నారు. కోరుట్లలో సైతం ముందు వరుసలో ఉన్నామన్నారు. కౌన్సిలర్‌గా కూడా గెలవని పీసీసీ చీఫ్ గురించి ఎంత మాట్లాడిన తక్కువేనని ఎంపీ అర్వింద్ అన్నారు. ఎంఐఎం నాయకుడు అక్బరుద్దీన్ మాట్లాడుతూ రావ్‌లు, రెడ్డిలు ఎవరైనా ఎంఐఎం కాళ్ల వద్దకు రావాలని సభాముఖంగా పేర్కొన్నారన్నారు. అలాంటి పార్టీతో కాంగ్రెస్ జత కలిసి మేయర్ పీఠం కోసం ప్రయత్నం చేయడాన్ని ఇందూరు ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఒకవేళ కాంగ్రెస్ ఎంఐఎంతో జతకట్టాలని అనుకుంటే పీసీసీ చీఫ్ కల్మా చదివి వారితో పొత్తు పెట్టుకోవాలన్నారు. కరీంనగర్‌లో బండి సంజయ్ పోరాడారని.. కేవలం నాలుగు సీట్లుతో వెనుక పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# శైవక్షేత్రాలకు శివరాత్రి శోభ..



మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. ఈ వేడుకను ఆదివారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా నగరంలోని నీలకంఠేశ్వరాలయం, శంభుని గుడి తదితర ఆలయాలను అందంగా అలంకరించారు. భక్తుల దర్శనార్థం ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. భక్తులు ఉపవాసాల నిమిత్తం పండ్లు కొనుగోలు చేస్తుండడంతో మార్కెట్లు సందడిగా మారాయి.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్





శంభు లింగేశ్వర ఆలయం





## ఆధ్యాత్మిక క్షేత్రం

# నవనాథ సిద్ధుల గుట్ట

▸ శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి ▸ తరలిరానున్న భక్తులు.. ▸ వసతులు కల్పించిన అధికారులు

**అలనాడు నవసిద్ధుల తపోవనమైన ఆ నల్లని బండరాళ్లు కాలక్రమేణా నవనాథసిద్ధుల గుట్టగా కీర్తికెక్కాయి. ఈ నవనాథ సిద్ధులగుట్ట ప్రకృతి సోయగాల తోరణం.. సహజ అందాల పుణ్యక్షేత్రం. కపిలవర్ణంలో కళకళలాడే ఈ గుట్ట ఇప్పుడు పర్యాటక సొబగులు అద్దుకున్నది. అనాదిగా ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ధికెక్కడమే కాదు.. ప్రస్తుతం పర్యాటక కేంద్రంగా ఆహ్లాదం పంచుతున్న సిద్ధులగుట్టపై 'అక్షరటుడే' ప్రత్యేక కథనం.**

– అక్షరటుడే, ఆర్మూర్

లోక కల్యాణార్థం నవనాథ సిద్ధులు గోరక్‌నాథ్, జలంధర్ నాథ్, చటపట్ నాథ్, అడ బంగనాథ్ కాణిపానాథ్, మచ్చేందర్ నాథ్, చౌరంగి నాథ్, రేవన్ నాథ్, భర్తేరీ నాథ్‌లు దేశమంతా సంచరిస్తూ ఆర్మూర్ కు చేరుకున్నారు. ఇక్కడి కొండ గుహల్లో తపస్సు చేసేందుకు సరైన ప్రదేశంగా వారు ఎంచుకొని ఇక్కడే గుహలో శివలింగం, సీతారాముల విగ్రహాలను ప్రతి ష్ఠించి పూజించారు. ఏళ్ల తరబడి ఇక్కడే నవసిద్ధులు తపస్సు చేసుకున్నారు. కొంతకాలానికి ఆరుగురు సిద్ధులు వెళ్లిపోగా ముగ్గురు మాత్రం ఆర్మూర్‌లోనే ఉండిపోయారని ప్రాచీనకథనం. ఆరు మూడు అని కాలక్రమంలో ఆరుమూరుగా వాడుకలోకి వచ్చింది. నవ సిద్ధులు తపస్సు చేసినందుకు నవనాథపురం అని ఈ పట్టణం ప్రాచుర్యంలోకి వచ్చింది.

### కొండల మధ్య ఆలయాలు...

ప్రకృతి రమణీయతకు ఆలవాలమైన నవనాథ సిద్ధుల గుట్ట పట్టణానికి మనోహరంగా నిలిచింది. నల్లని కొండరాళ్లతో సుమారు రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేర విస్తీర్ణంలో విస్తరించి ఉంది. సుమారు 300లకు పైగా మెట్లు ఎక్కి భక్తులు.. సిద్ధులు ప్రతిష్టించిన శివలింగం, సీతారాములను దర్శించుకుంటారు. అటు తర్వాత ఘాట్ రోడ్డు ఏర్పడడంతో భక్తులు మెట్లు, ఘాట్ రోడ్డు ద్వారా గుట్ట పైకి చేరుకుంటున్నారు. శివాలయం, సీతారాములతో ఏకశిలతో పాటు గుట్టపైనున్న పిరమిడ్, హనుమాన్ ఆలయం, అయ్యప్ప స్వామి ఆలయలను భక్తులు దర్శించుకుంటారు.

### శివరాత్రి ఏర్పాట్లు..

శివరాత్రి సందర్భంగా నవనాథ సిద్ధుల గుట్టపై భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మెట్లు, ఘాట్ రోడ్ ద్వారా వచ్చే భక్తులకు అనువుగా నీటి సౌకర్యంతో పాటు చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. కొండపైకి ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్సును నడపనున్నారు. గుహలోని



శివలింగాన్ని దర్శించుకోవడానికి అనువుగా క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

**భీమ్‌గల్ మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా తలకిందులయ్యాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో 12కు 12 వార్డులను కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేసిన బీఆర్ఎస్ పార్టీ ఈసారి బల్దియా ఎన్నికల్లో ఘోరమైన పరాజయాన్ని చవిచూసింది. అభివృద్ధి మంత్రం, అధికార పార్టీపై నమ్మకంతో ఓటర్లు ఈసారి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో కాంగ్రెస్ 8 స్థానాలను గెలుచుకోగా, ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ 4 స్థానాలకే పరిమితమైంది.**

- అక్షరటుడే, భీమ్‌గల్




# భీమ్‌గల్‌లో ఫలించిన సునీల్ రెడ్డి వ్యూహం..

- బల్దియా కాంగ్రెస్ కైవసం..
- 8 స్థానాల్లో విజయం
- నాలుగు వార్డులకు పరిమితమైన బీఆర్ఎస్

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ తనదైన శైలిలో ప్రచారాన్ని ముమ్మరం చేసి, క్షేత్రస్థాయిలో ఓటర్లను ఆకట్టుకోవడంలో సఫలమయ్యారు. దీనికి తోడు స్థానికుడు, పీసీసీ అధ్యక్షుడు, భీమ్‌గల్ మండలం రహత్ నగర్ గ్రామానికి చెందిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కార్పొరేషన్ ఛైర్మన్లు ఈరవత్రి అనిల్, మానాల మోహన్ రెడ్డి, అన్వేష్ రెడ్డి వంటి ఉద్దండులు రంగంలోకి దిగి పావులు కదపడంతో భీమ్‌గల్ బల్దియాలో కాంగ్రెస్ విజయం సునాయాసమైంది. పట్టణ అభివృద్ధి అధికార పార్టీతోనే సాధ్యమన్న వీరి ప్రచారాన్ని ఓటర్లు విశ్వసించారు.

### ప్రతిఘటించినా ఫలితం దక్కని వేళ..

మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి భీమ్‌గల్‌లోనే మకాం వేసి, స్వయంగా ప్రచార జోరును పెంచినప్పటికీ, బీఆర్ఎస్ తన పాత ప్రభావాన్ని చాటలేకపోయింది. గతంలో వందశాతం ఫలితాలు సాధించిన చోట, ఈసారి కేవలం 4 వార్డులకే పరిమితం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### ఛైర్‌పర్సన్ పీఠం దక్కేదెవరికో..

మొత్తం 12 వార్డుల్లో 8 వార్డులు గెలిచి స్పష్టమైన మెజారిటీ సాధించడంతో, ఇప్పుడు అందరి దృష్టి ఛైర్‌పర్సన్ పీఠంపై పడింది. రేసులో ముగ్గురు మహిళా నేతల పేర్లు గట్టిగా వినిపిస్తున్నారు. ఆరేపల్లి శ్రీజ (మూడో వార్డు) పట్టణంలోని కీలక సామాజిక సమీకరణాలతో పాటు పార్టీలో మంచి పట్టున్న నేతగా గుర్తింపు పొందారు. అలాగే బొదిరె నాగమణి (ఆరో వార్డు) సీనియారిటీ, స్థానిక సంబంధాలతో ఛైర్‌పర్సన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. పదో వార్డు నుంచి గెలిచిన సంటి లత పేరు ఛైర్‌పర్సన్ రేసులో వినిపిస్తోంది. పార్టీ పట్ల విధేయత, వార్డులో సాధించిన మెజారిటీ ఆమెకు కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. ఈ నెల 16న ఛైర్ పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎవరనేది తేలనుంది. వారి పేర్లను అధిష్టానం ఖరారు చేయనుంది.

### క్యాంప్ రాజకీయాలు షురూ..

ఫలితాలు వెలువడిన వెంటనే గెలిచిన అభ్యర్థులు క్యాంప్‌లకు తరలిపోయారు. పార్టీ అధిష్టానం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. ఏది ఏమైనా, భీమ్‌గల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ సాధించిన ఈ విజయం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అభివృద్ధి పథంలో పట్టణాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కొత్త పాలకవర్గం సిద్ధమవుతోంది.

## అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మండలం సంగోజిపేట్ గ్రామంలో శనివారం ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా జింక చిన్నపోచయ్య, కార్యదర్శిగా జింక సాయిరాం, క్యాషియర్‌గా శంకర్, ప్రత్యేక సలహాదారుగా జింక పోశయ్య, సలహాదారుగా నీరడి కిష్టయ్యను ఎన్నుకున్నారు. అలాగే సభ్యులుగా సాయిబాబా, మన్నె సాయికుమార్, నర్సింలు, కాశవ్వ, జింక సాయిలు, చిన్న సాయిలు, సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు దేశాయిపేట్ ప్రశాంత్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు మన్నె సాయిలు, కొత్తబాద్ మాజీ సర్పంచ్ సాయిలు, పరిమల సాయిలు, పోతురాజు సాయిలు, పోతురాజు లింగం తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ

**అక్షరటుడే, బాల్కొండ:** పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రికవరీ చేసినట్లు బాల్కొండ ఎస్సై శైలేందర్ తెలిపారు. ఈ మేరకు శనివారం బాధితుడికి అందజేశామన్నారు. మండల పరిధిలోని శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన వికలాంగుడు శ్రీనివాస్ తన సెల్‌ఫోన్‌ను గత డిసెంబర్ 16న పోగొట్టున్నాడు.



వెంటనే తమకు ఫిర్యాదు చేయగా సాంకేతికత ఆధారంగా సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేసినట్లు ఎస్సై తెలిపారు.